సాక్షి
అనంతపురం
మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



ఆద్యంతం.. అద్భుతం

అనంతపురం నగరానికి చెందిన ఐదేళ్ల చిన్నారి ఆద్య శాస్త్రీయ నృత్యంలో అదరగొడుతోంది.

8లో



టమాట కిలో రూ.50

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.50 పలికింది. కనిష్టం రూ.26, సరాసరి రూ.37 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.3°/22.8°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

12 మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 12 మండలాల పరిధిలో 4.7 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. కణేకల్లు 38 మి.మీ. డి.హీరేహాళ్ 32, రాయదుర్గం 20.4, బెళుగుప్ప 14.2, బొమ్మనహాళ్ 12.4, బ్రహ్మసముద్రం 10 మి.మీ నమోదు కాగా మిగతా మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. అక్టోబర్ సాధారణ వర్షపాతం 100.9 మి.మీ కాగా 105.9 మి.మీ నమోదైంది. గత జూన్ నుంచి ఇప్పటి వరకు 398.2 మి.మీ గానూ 34.9 శాతం అధికంగా 537.2 మి.మీ నమోదైంది. 44 వర్షపు రోజులు (రెయినీడేస్) రికార్డయ్యాయి. రాగల రెండు రోజులు వర్ష సూచన లేదని శాస్త్రవేత్తలు తెలిపారు.

23న అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



అనంతపురం సెంట్రల్: అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్, శింగనమల, నార్పల, తాడిపత్రి, ఉరవకొండ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ పోస్టుల భర్తీకి ఈ నెల 23న ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు అర్బన్ సీడీపీఓ లలితమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని, మధ్యవర్తుల మాటలు నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని సూచించారు. ఎవరైనా పోస్టులు ఇప్పిస్తామని డబ్బు డిమాండ్ చేస్తే ఏసీబీ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం ఇంకెన్నాళ్లు?

- మాజీ ఎమ్మెల్యే అనంత



మాట్లాడుతున్న అనంత

అనంతపురం కార్పొరేషన్: నారా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగంలో శాంతిభద్రతలు గాల్లో దీపంలా మారాయని, ఈ పరిస్థితిని ఇంకెన్నాళ్లు కొనసాగిస్తారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో సీఎం చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారన్నారు. నాలుగు నెలల వ్యవధిలో ఏకంగా 74 మంది చిన్నారులు, మహిళలపై అత్యాచార ఘటనలు జరిగాయంటే రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా? అని ప్రశ్నించారు. చిలమత్తూరు మండలంలో దసరా రోజు అత్తాకోడళ్లపై అత్యాచారం చేశారని, ఇటీవల బద్వేలులో ఇంటర్ విద్యార్థినిపై పెట్రోలు పోసి నిప్పంటించారన్నారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో అదృశ్యమైన బాలిక మృతదేహం ఇప్పటికీ దొరకలేదని గుర్తు చేశారు. సాక్షాత్తూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో ఓ బాలికపై అత్యాచారం జరిగితే ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. బాలికలు, మహిళలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వంలో తీసుకొచ్చిన దిశ యాప్‌ను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. గతంలో తెలంగాణలో ఓ ఘటన జరిగిందని, అలాంటి పరిస్థితి రాష్ట్రంలోని అక్క చెల్లెమ్మలకు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'దిశ' వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దిశ పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేసి, రక్షణ చర్యలు చేపట్టారన్నారు. నేడు రాష్ట్ర హోం మంత్రిగా ఓ మహిళ ఉన్నా, ఎక్కడ చూసినా మహిళలు, చిన్నారులపై అత్యాచార ఘటనలు జరుగుతుండటం దౌర్భాగ్యమన్నారు. నాలుగు నెలలుగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి వేధించడమే ప్రభుత్వం పనిగా పెట్టుకుందన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగానికి బదులు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతుండటంతోనే ఈ దుస్థితి దాపురించిందని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు చెప్పినట్లుగానే లోకేష్ వ్యవహరిస్తున్నారన్నారు. ఆడపిల్లల మాన ప్రాణాల రక్షణలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఆదాయమే తప్ప ప్రజల గోడు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది కూటమి సర్కారు. అలవిగాని హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు.. నేడు వాటిని పట్టించుకోవడమే లేదు. సూపర్ సిక్స్ హామీల ఊసే ఎత్తడం లేదు. ఇదే క్రమంలో ప్రజా క్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకూ ప్రస్తుతం మంగళం పాడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో జనాభాకు అనుగుణంగా కొత్తగా 12 పీహెచ్‌సీలు ఏర్పాటు చేయాలని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని పూర్తిగా కూటమి ప్రభుత్వం పక్కన పెట్టేయడమే దీనికి నిదర్శనం.



వైఎస్సార్ సీపీ హయాంలో అనంతపురంలోని కోర్టు రోడ్డులో అత్యాధునికంగా నిర్మించిన ఆస్పత్రి

మద్యానికి ఎస్.. వైద్యానికి నో!

- జనాభా ప్రాతిపదికన విభజించి మరీ మద్యం షాపులు
- మద్యం లైసెన్సు రేటు కూడా ఫిక్స్ చేసిన బాబు సర్కారు
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మాత్రం నో చెప్పిన వైనం
- కొత్తగా ఏర్పాటు చేయాల్సిన 12 పీహెచ్‌సీలపై గొడ్డలి వేటు
- కొత్తగా సిబ్బందినీ నియమించేది లేదన్న కూటమి ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో డయేరియా, డెంగీ జబ్బులు ప్రబలుతున్నాయి. మానసిక వ్యాధుల బాధితులు పెరిగి జనం గగ్గోలు పెడుతున్నారు. ఈ సమయంలో ప్రాథమిక ఆస్పత్రులను ఏర్పాటు చేయాల్సిన సర్కారు వాటికి ఉచ్చు బిగించింది. మద్యం షాపులకు మాత్రం బార్లా తెరిచింది. జనాభా ప్రాతిపదికన మద్యం షాపులు ఇవ్వాలని ఏకంగా జీఓలోనే ఇచ్చారు. పాపులేషన్ (జనాభా)ను బట్టి మద్యం ధరలు నిర్ణయించారు. ఇదే ప్రాతిపదికన ఆస్పత్రులు, అందుకు తగ్గ సిబ్బంది ఏర్పాటు చేయడానికి మాత్రం సర్కారు తిలోదకాలిచ్చింది. ఆదాయం తెచ్చిపెడుతుంది కాబట్టి మద్యం బాటే పడతాం అన్న రీతిలో వ్యవహరిస్తోంది.



ప్రస్తుతం అనంతపురంలోని ఓ వైన్‌షాపు వద్ద జనం రద్దీ

కొత్త పీహెచ్‌సీలకు మంగళం..

జనాభాను బట్టి ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొత్తగా 12 పీహెచ్‌సీలు ఏర్పాటు చేసేందుకు వైఎస్సార్ సీపీ హయాంలో జీఓ జారీచేశారు. పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లు, 12 మంది సిబ్బంది కలిపి 14 మందిని నియమించేందుకు రంగం సిద్ధం చేశారు. అయితే, అదే సమయంలో ప్రభుత్వం మారడంతో కొత్త పీహెచ్‌సీల ఏర్పాటు అంశం మరుగున పడిపోయింది. ఆ విషయాన్ని పట్టించుకునే నాథుడే లేడు. జనాభా ప్రాతిపదికన మద్యం షాపులు ఏర్పాటు చేస్తాం గానీ వైద్యం చేయలేమని నేడు కూటమి సర్కారు చేతులెత్తేసింది.

జబ్బులతో అల్లాడుతున్నా..

గత ప్రభుత్వం ప్రాథమిక వైద్యానికి పెద్దపీట వేసింది. వలంటీర్లు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, 104 వాహనాలు ఇళ్లకే వెళ్లి పేషెంట్లను చూడటం వంటి కార్యక్రమాలతో పల్లెవాసులకు భరోసా కల్పించింది. అప్పట్లో నిత్యం జబ్బులను జల్లెడ పడుతూ బాధితులకు మందులిచ్చేవారు. కరోనా సమయంలో సర్కారే జనాన్ని కంటికి రెప్పలా కాపాడిన విషయం తెలిసిందే. కానీ నేడు జ్వరమొచ్చినా, కాళ్లూ చేతులూ విరిగినా పట్టించుకునే దిక్కు లేదు. కొన్నాళ్లుగా డయేరియా, డెంగీ కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. హెపటైటిస్ బీ కేసులు భారీగా నమోదవుతున్నా పట్టించుకోవడం లేదు. ఇక మానసిక రుగ్మతలు పల్లెలనూ పట్టి పీడిస్తున్నాయి. పాముకాటు కేసులతో రెండు జిల్లాల్లో పదుల సంఖ్యలో మృతి చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆస్పత్రులను ఏర్పాటు చేయడం మరచి పెనుకొండలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీని కూడా ఆపేశారు. ప్రభుత్వాసుపత్రుల్లో ఎక్కడా మందులు లేవు. ఆరోగ్యశాఖలో కొత్త నియామకాలు, పదోన్నతులు ఇవ్వకూడదని నిర్ణయం తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో ఆస్పత్రుల వివరాలు

కేటగిరీ	సంఖ్య
జనాభా	24,00,000
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	45
అర్బన్ హెల్త్ కేంద్రాలు	25
సామాజిక ఆరోగ్య కేంద్రాలు	07
ఏరియా ఆస్పత్రులు	03
బోధనాసుపత్రులు	01

మద్యం షాపుల వివరాలు

మద్యం షాపులు	136
బార్ అండ్ రెస్టారెంట్లు	20
ఎలైట్‌షాపు (అనుమతి)	01

పీహెచ్‌సీలు ఏర్పాటు చేయాలి



గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీలకు నిధులు కేటాయించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోనే నాణ్యమైన వైద్యం అందింది. కూటమి ప్రభుత్వంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు పెట్టిన పేరును తొలగించడమే కాకుండా మౌలిక సదుపాయాలు తగ్గించేశారు. ప్రజారోగ్యం పట్ల శ్రద్ధ చూపకుండా ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే మద్యం షాపుల పట్ల కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గత ప్రభుత్వంలో జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేయాలనుకున్న పీహెచ్‌సీలపై చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి.

– రాంభూపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వీడాలి



కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. ఇసుక, మద్యం దందాపైనే దృష్టి సారించింది. ఓపెన్ మార్కెట్‌లో మద్యాన్ని విచ్చలవిడిగా తాగించేలా చేస్తున్నారు. మద్యం షాపుల ఏర్పాటుతో మూడు రోజుల్లోనే రూ.541 కోట్లు తాగించేశారు. రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారు. మత్తుతోనే అత్యాచారాలు, దౌర్జన్యాలు, దాడులు జరుగుతున్నాయి. మరోవైపు పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.వేలు ఖర్చు చేసుకుంటున్నారు. జిల్లాకు జనాభా ప్రాతిపదికన మంజూరైన పీహెచ్‌సీల ఏర్పాటుతో క్షేత్రస్థాయిలో మరింత మెరుగైన వైద్యం అందుతుంది. ఓట్లేసిన ప్రజలకు బాధ్యతగా సేవలందించాలి.

– నాగేంద్ర, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: సమస్యలపై ప్రజల నుంచి అందే అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, జిల్లావ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, డీపీఓ నాగరాజు స్వీకరించాను. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 363 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపకపోతే రీ–ఓపెన్ అవుతాయన్నారు. రోజూ సిబ్బందితో సమీక్షించాలన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

వినతుల్లో కొన్ని...

- తమ భూమిని వేరొకరి పేరున ఆన్‌లైన్ చేశారని వడ్డుపల్లి అనంతమ్మ ఫిర్యాదు చేశారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంట గ్రామ పొలం సర్వే నంబరు 316లో తమకున్న 11ఎకరాల భూమిలో 5 ఎకరాలను పార్వతమ్మ అనే మహిళకు విక్రయించామని చెప్పారు. తన ఆధీనంలో ఉన్న మిగిలిన ఆరు ఎకరాల్లో రెండు ఎకరాలను వేరొకరి పేరున ఆన్‌లైన్‌లో ఎక్కించారని చెప్పారు. భూమి తమ పేరున నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.
- కూడేరు మండలం కరుట్లపల్లిలో దళితుల శ్మశాన వాటికను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, సర్పంచు ఓబుళమ్మ, నాయకులు విన్నవించారు. గ్రామ పొలం సర్వే నంబరు 29లో 82 సెంట్ల భూమిని శ్మశాన వాటిక కోసం గతంలో కేటాయించారన్నారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.
- వితంతు పింఛను మంజూరు చేయించాలని గుంతకల్లు పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన బోయ సరోజ విన్నవించారు. తన భర్త క్రిష్టప్ప ఈ ఏడాది జనవరి 19న మరణించారన్నారు. వితంతు పింఛనుకు దరఖాస్తు చేసినా మంజూరు కాలేదని, ఆదుకోవాలని కోరారు.
- ఇంటి నిర్మాణానికి సంబంధించి డబ్బు మంజూరైనా ఖాతాలో జమ కాలేదని శింగనమల మండలం సలకంచెరువుకు చెందిన మల్లికార్జున ఫిర్యాదు చేశారు. పీఎంఏజేవై పథకం కింద ఇంటిని నిర్మించుకుని ఏడాదైందని, ఇందుకు రూ.1.80 లక్షలు మంజూరైనప్పటికీ తన ఖాతాలో డబ్బు జమ కాలేదన్నారు. డబ్బు మంజూరయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

- ఏపీ వలంటీర్ల సంఘం జిల్లా కన్వీనర్ సంతోష్ కుమార్ డిమాండ్

అనంతపురం అర్బన్: వలంటీర్లను ప్రభుత్వం విధుల్లోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ వలంటీర్ల సంఘం జిల్లా కన్వీనర్ సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు.వలంటీర్లను కొనసాగిస్తామంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకోవాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సంతోష్‌కుమార్, కో–కన్వీనర్లు ఆనంద్ కుమార్, శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా వలంటీర్లు కీలకంగా పనిచేశారన్నారు. అధికారంలోకి వస్తే వారి సేవలను కొనసాగిస్తామని, రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజుల దాటినా దీనిపై కనీసంగానూ దృష్టి పెట్టలేదన్నారు. ఇప్పటి వరకు ఏడు సార్లు మంత్రివర్గ సమావేశాలు నిర్వహించినా స్పందన లేదన్నారు. పలువురు మంత్రులను కలిసి విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా వలంటీర్ల కొనసాగింపుపై కేబినెట్‌లో చర్చించి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవం



ముద్దాయి రుద్రేష్

అనంతపురం/కంబదూరు/కూడేరు: హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష పడింది. దీంతో పాటు రూ.25 వేల జరిమానా విధించారు. ఈ మేరకు సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ సంచలన తీర్పు వెలువరించారు. వివరాలు.. కంబదూరు మండలం కదిరిదేవరపల్లికి చెందిన రుద్రేష్ ఎంఏ చదివాడు. అతని భార్య పార్వతి బీఈడీ పూర్తి చేసింది. ఇద్దరూ కళ్యాణదుర్గంలో ట్యూషన్లు చెప్పుకుంటూ వచ్చే ఆదాయంతో జీవనం చేసేవారు. గతంలో ఓ రోజు రుద్రేష్ ఫోన్‌కు అనంతపురం నగరానికి చెందిన విజయలక్ష్మి రాంగ్‌కాల్ చేసింది. ఇద్దరూ మాటామాటా కలిపారు. ఆ తర్వాత మళ్లీ మళ్లీ మాట్లాడుకుంటూ వాట్సాప్‌లో మెసేజ్‌లు చేసుకునే స్థాయికి వెళ్లారు. డీఈడీ పూర్తి చేసిన విజయలక్ష్మికి అప్పటికే వివాహమైంది. భర్త ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేసేవారు. ఒకటిన్నర సంవత్సరం గల బాలుడు ఉన్నాడు. అయినా, ఆ బంధాలన్నీ రుద్రేష్, విజయలక్ష్మి మరచిపోయారు. వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. కొన్నాళ్లకు విజయలక్ష్మి తనను పెళ్లిచేసుకోవాలంటూ రుద్రేష్‌ను డిమాండ్ చేయడం ప్రారంభించింది. తాను భర్తను వదిలి వస్తానని, నువ్వు కూడా భార్యను వదిలి వస్తే పెళ్లి చేసుకుందాం అనేది. విషయం రుద్రేష్ భార్యకు తెలియడంతో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. మరో వైపు విజయలక్ష్మి రుద్రేష్‌ను బెదిరించడం ప్రారంభించింది. నీవు పంపిన వాట్సాప్ మెసేజ్‌లు, ఫొటోలను పోలీసులకు చూపి కేసు పెడతా అంటూ బెదిరించేది. దీంతో విజయలక్ష్మిని తుదముట్టించాలని రుద్రేష్ నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే 2018 సెప్టెంబర్ 4న రుద్రేష్‌కు ఫోన్ చేసిన విజయలక్ష్మి మరుసటి రోజు బయటకు వస్తున్నానని, నువ్వు కూడా రావాలని కోరింది. ఇదే అదునుగా భావించిన అతను అనంతపురం చేరుకున్నాడు. ఇద్దరూ స్కూటీలో కూడేరు మండలం ఉదిరిపికొండ–శివరాం పేట గ్రామాల మధ్యలో ఒక గుట్ట వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలోనే రుద్రేష్ విజయలక్ష్మి గొంతుకు ఆమె చున్నీతోనే బిగించి, ఊపిరి ఆడకుండా చేశాడు. అక్కడే ఉన్న బండరాయితో తలపై మోది అతి కిరాతకంగా హత్య చేశాడు. విజయలక్ష్మి శరీరంపై ఉన్న నగలు తీసుకుని కళ్యాణదుర్గం చేరుకున్నాడు. ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి రూ.లక్ష లోన్ తీసుకుని, తన భార్య పార్వతి కోసం స్థానికంగా ఓ బంగారు షాపులో నల్లపూసల దండకు రూ.30 వేలు అడ్వాన్స్ కట్టి ఆర్డర్ ఇచ్చాడు. మరుసటి రోజు ఎల్ఈడీ టీవీ కొనుగోలు చేశాడు.

ఫిర్యాదుతో వెలుగులోకి..

బయటకు వెళ్లిన భార్య రాకపోవడంతో విజయలక్ష్మి భర్త టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలోనే ఉదిరిపికొండ– శివరాం పేట గ్రామాల సమీపంలో విజయలక్ష్మి మృతదేహం బయటపడింది. కేసు నమోదు చేసిన అప్పటి సీఐ ప్రసాద్‌రావు మృతురాలి సెల్‌ఫోన్, సీసీ కెమెరాల ఆధారంగా రుద్రేష్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. జిల్లా కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. రుద్రేష్‌పై నేరం రుజువు కావడంతో యావజ్జీవ కఠిన కారాగారశిక్ష విధిస్తూ సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ తీర్పు వెలువరించారు.

కబ్జాల వీఆర్‌ఓ!

- వీఆర్‌ఓ సూర్యనారాయణ లీలలు
- తనతో పాటు బంధువుల పేరిట సుమారు 30 ఎకరాలు ఆన్‌లైన్‌లోకి
- కలెక్టర్‌ను ఆశ్రయించిన ఓ బాధితుడు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: చిన్న ఉద్యోగమైనా భారీగా ఆస్తులు కూడబెట్టుకోవచ్చు అని నిరూపించారు ఒక వీఆర్‌ఓ. ఎకరాల కొద్దీ ప్రభుత్వ, పేదల భూమిని తనతో పాటు బంధువుల పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని పాస్‌బుక్కులు సృష్టించారాయన. వివరాలు... రాప్తాడు మండలం యర్రగుంట గ్రామానికి చెందిన సూర్యనారాయణ వీఆర్‌ఏగా రెవెన్యూ శాఖలో చేరారు.ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలంలో వీఆర్‌ఓగా పనిచేస్తున్న ఈయన కబ్జాలకు మారుపేరుగా మారారు. తనకున్న పరిచయాలు, స్థానికంగా భూముల వివరాలు తెలుసుకుని సుమారు 30 ఎకరాలు కబ్జా చేశారు. రాజకీయంగా అండదండలుండటంతోనే రెచ్చిపోతున్నట్లు తెలిసింది.

అంతా మిస్టరీ..

రాప్తాడు మండలం యర్రగుంట గ్రామంలో సుమారు 30 ఎకరాలు కబ్జాకు గురైంది. శీలం సూర్యనారాయణతో పాటు అతని ఇంటిపేరుతోనే ఉన్న ఐదారుగురి పేరిట ఒక్కొక్కరికి 3 ఎకరాల నుంచి 7 ఎకరాల వరకూ రికార్డుల్లో నమోదైంది. ఈ భూమిని ఎవరు ఇచ్చారు, ఎలా రికార్డుల్లో ఎక్కింది, ఒకే కుటుంబానికి చెందిన వారికి ఎలా దక్కింది అనేది మిస్టరీగా మారింది. గొర్ల నల్లపరెడ్డికి 2001లోనే ప్రభుత్వం 3.80 ఎకరాలకు డీ పట్టా ఇచ్చింది. అప్పటినుంచి భూమిని ఆయన సాగు చేసుకుంటున్నారు. బోరుతో పాటు కరెంటు లైను, మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. అయితే, ఈ భూమిని సూర్యనారాయణ తన బంధువుల పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించారు. ఇదేంటని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారు. తాజాగా జేసీబీతో కరెంటు పోళ్లు కూల్చేయించారు. దీంతో దిక్కు తెలియని నల్లపరెడ్డి కుటుంబం కలెక్టర్ వినోద్ కుమార్‌కు ఫిర్యాదు చేయగా.. ఆయన విచారణకు ఆదేశించారు.

సూర్యనారాయణ, కుటుంబ సభ్యుల పేరున నమోదైన భూముల వివరాలు

పేరు	సర్వే నం	విస్తీర్ణం (ఎకరాల్లో)
శీలం నాగమ్మ	259-1	3.80
శీలం సూర్య నారాయణ	259-2	5.25
శీలం వెంకటేసు	253-3	4.40
శీలం శ్రీరాములు	259-ఎ	5.20
శీలం నాగన్న	65-1	5.00

ఎన్నో ఏళ్లుగా భూములున్నాయట!

వీఆర్‌ఓ సూర్యనారాయణ మాత్రం పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. తమకు ఎన్నో ఏళ్లుగా భూములున్నాయన్నారు. తన పేరుపై ఉన్న 5.25 ఎకరాల భూమిని తమ తండ్రి, ఐదుగురు అన్నదమ్ములు రాయించారన్నారు. అయితే, ఇంకా ఆ భూమిని పంచుకోలేదని, భూ పంపిణీ జరిగితే పంచుకుంటామని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా భూములున్నట్టు ఆధారాలేమైనా ఉన్నాయా అంటే లేవన్నారు. ఈ భూములన్నీ 2013 తర్వాత ఆన్‌లైన్‌లోకి ఎక్కించినట్టు ఆధారాలు చెబుతున్నాయి.

అమరుల స్ఫూర్తితో విధులకు పునరంకితం





పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్య అతిథులు, ప్రజాప్రతినిధులు, అమరవీరుడి కుటుంబసభ్యురాలికి చెక్కు అందజేస్తున్న దృశ్యం

- డీఐజీ డాక్టర్ షిమోషి, ఎస్పీ జగదీష్
- ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

అనంతపురం: ప్రజా సేవలో పునీతులైన అమరవీరుల స్ఫూర్తితో విధులకు పునరంకితమవుదామని అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషి, జిల్లా ఎస్పీ పి. జగదీష్ పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో సోమవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్, డీఐజీ షిమోషి, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ తదితరులు హాజరయ్యారు. పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఐజీ షిమోషి మాట్లాడుతూ దేశ భద్రతలో పోలీసుల పాత్ర కీలకమైందన్నారు. నిరంతరం ప్రజలు, సమాజం కోసం పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఎస్పీ పి. జగదీష్ మాట్లాడుతూ చిన్న సమస్యల పరిష్కారం నుంచి ప్రకృతి వైపరీత్యాల వరకు పోలీసు సేవలు తప్పనిసరిగా మారాయన్నారు. పోలీసులు కూడా సమాజంలో భాగమని అందరూ భావించాలన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ పోలీసులకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమన్నారు. ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతూ ప్రాణాలను పణంగా పెడుతున్న పోలీసులకు సెల్యూట్ తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేమన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం అహర్నిశలు పనిచేస్తూ ప్రాణాలు సైతం పణంగా పెడుతున్న పోలీసులకు ఇచ్చే పరిహారం రెట్టింపు చేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌ను కోరారు.

అమరవీరుల కుటుంబాలకు చెక్కులు

కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయామని అధైర్యపడరాదని, అండగా పోలీసు శాఖ ఉంటుందని డీఐజీ, ఎస్పీలు పోలీసు అమరవీరుల కుటుంబాలకు భరోసా ఇచ్చారు. గతేడాది రోడ్డు ప్రమాదాలు, ఇతర కారణాలతో మరణించిన 12 మంది పోలీసులు, హోంగార్డుల కుటుంబాలకు మొత్తం రూ. 1.05 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీలు వై. శివరామి రెడ్డి, మంగమ్మ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి, డీఎంఅండ్‌హెచ్‌ఓ ఈ. భ్రమరాంబ దేవి, డీఎస్పీలు వి. శ్రీనివాస రావు, టి. వెంకటేశ్వర్లు, ఎస్. మహబూబ్ బాషా, సీఐలు ధరణి కిశోర్, క్రాంతికుమార్, కే. సాయినాథ్, హేమంత్‌కుమార్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ఎస్ఐ జాఫర్, జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శ్రీనివాసులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



108 వాహనంలో వెంకటేష్ నాయక్‌కు తరలిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఆటో ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కనగానపల్లి మండలం మద్దెలచెరువుకు చెందిన రామ్‌చరణ్, బద్దలాంపురం గ్రామానికి చెందిన గణేష్ అనే ఇద్దరు యువకులు సోమవారం ఉదయం మద్దెలచెరువు నుంచి ఆత్మకూరుకు ఆటోలో బయల్దేరారు. ఆత్మకూరు మండలం పాపంపల్లి వద్ద ఆ గ్రామానికి చెందిన వెంకటేష్‌నాయక్‌ను ఆటోలో ఎక్కించుకున్నారు. ఆత్మకూరులోని సివిల్ సప్లయ్ గోదాము వద్దకు రాగానే ఆటో అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఆటోలో ఉన్న రామ్‌చరణ్, గణేష్‌కు కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో మరో ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. తల, గొంతు భాగాల్లో గాయాలైన వెంకటేష్‌నాయక్‌ను 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

ముగిసిన ఎస్కేయూ గ్రూప్-బీ పోటీలు



ట్రోఫీని అందజేస్తున్న ఎస్కేయూ స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ బి.జెస్సీ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం గ్రూప్-బీ పోటీలు సోమవారం ముగిశాయి. ఎస్ఎస్‌బీఎన్, ఆర్ట్స్ కళాశాల జట్ల మధ్య జరిగిన కబడ్డీ పోటీల్లో ఎస్ఎస్‌బీఎన్ ఘన విజయం సాధించింది. వరుసగా ఎస్ఎస్‌బీఎన్ ఆర్ట్స్ కళాశాలపై మూడో దఫా విజయం సాధించి రికార్డు సృష్టించింది. ఎస్ఎస్‌బీఎన్ 61 పాయింట్లు సాధించగా, ఆర్ట్స్ కళాశాల జట్టు 31 పాయింట్లకే పరిమితమైంది. అలాగే బాస్కెట్‌బాల్ విజేతగా ఎస్ఎస్‌బీఎన్, రన్నర్స్-ఎస్కేయూ నిలిచాయి. బ్యాడ్మింటన్ విజేతగా అనంతపురం ఆర్ట్స్ కళాశాల, రన్నర్స్‌గా ఎస్ఎస్‌బీఎన్ నిలిచింది. ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో నిర్వహించిన ముగింపు సమావేశంలో ఎస్కేయూ స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ బి.జెస్సీ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు ట్రోఫీలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. ప్రభాకర్ రాజు, ఫిజికల్ డైరెక్టర్ జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆద్యంతం అద్భుతం



ఆద్యలక్ష్మి నాట్యప్రదర్శనలోని ఒక ఘట్టం

'పిట్ట కొంచెం.. కూత ఘనం' సామెత ఆ చిన్నారికి సరిగ్గా సరిపోతుంది. వయసు ఐదేళ్లే. అయినా తన నాట్య విన్యాసంతో అందరినీ సమ్మోహితులను చేస్తుంది. రాష్ట్ర గవర్నర్ తన ఇంటికి పిలిపించుకుని చిన్నారి నాట్య ప్రదర్శనను తిలకించి పులకించిపోయారు. ప్రముఖుల చేత ప్రశంసలు.. లెక్కకు మించి బహుమతులతో ఏకంగా వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు సంపాదించుకుంది.

- నాట్య విన్యాసం.. సమ్మోహనం
- శాస్త్రీయ నృత్యంలో అదరగొడుతున్న ఆద్యలక్ష్మి
- ప్రముఖుల ప్రశంసలు.. పలు అవార్డులు సొంతం
- వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

అనంతపురం కల్చరల్: చిరుప్రాయంలోనే కూచిపూడిలో అరంగేట్రం చేసి అబ్బురపరుస్తోంది ఆద్యలక్ష్మి. నాట్య ప్రదర్శనలో ఎన్నో అద్భుతాలు సృష్టిస్తోంది. అనంతపురం నగరానికి చెందిన రొబ్బి అరుణ్‌కుమార్, నాగార్పిత దంపతులకు ఆద్యలక్ష్మి 2019 సంవత్సరంలో జన్మించింది. తల్లిదండ్రులతో పాటు అవ్వాతాతలు ధరణి, విశ్వనాథం చిన్నారిని శాస్త్రీయ నృత్యంలో తీర్చిదిద్దాలని భావించారు. అనుకున్నదే తడవుగా శారదామాత సన్నిధిలో 'గురుశ్రేష్ట' రమ్యకృష్ణ చేత కూచిపూడిలో అరంగేట్రం చేయించారు. నాట్య రీతులను ఆకళింపు చేసుకున్న ఆద్యలక్ష్మి ముందుకు సాగింది. నాట్యంలో విశేష ప్రతిభకనబరుస్తూ అందరి చేత శభాష్ అనిపించుకుంది. యూకేజీ చదువుతున్న ఈ చిన్నారి అంచలంచెలుగా నాట్యంలో ప్రావీణ్యం సంపాదిస్తూ అవార్డులు, ప్రశంసలతో దూసుకుపోతోంది.

మెప్పించిన ప్రదర్శనలెన్నో..

- 2022లో తిరుమల బ్రహ్మోత్సవాల్లో ఆద్యలక్ష్మి నాట్య ప్రదర్శన ఇచ్చింది. ఆ ఉత్సవాల్లో చిన్నారి నాట్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
- 2024 మార్చిలో గవర్నర్ నజీర్ అహ్మద్ ఆద్యలక్ష్మి గురించి సోషల్‌మీడియా ద్వారా తెలుసుకుని స్వయంగా ఫోన్ చేసి రాజ్‌భవన్‌కు పిలిపించుకుని నాట్య ప్రదర్శన తిలకించి అభినందించారు.
- ఆద్యలక్ష్మి అనతికాలంలోనే వివిధ రాష్ట్రాల్లోని ఆధ్యాత్మిక వేదికలపై శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఇచ్చి మైమరిపించింది. హంపి ఉత్సవాల్లో ఆత్మీయ అతిథిగా ఆద్యలక్ష్మి ప్రదర్శనలిచ్చి ఆకట్టుకుంది.
- దసరా సందర్భంగా మైసూరు ఉత్సవాలు, విజయవాడ కనక దుర్గమ్మ సన్నిధి, శ్రీశైలం మహాశివుడి బ్రహ్మోత్సవాలు, కాణిపాకం ఉత్సవాలు, ఒంటిమిట్ట రాములోరి వేడుకలు ఆద్యలక్ష్మి ప్రతిభకు చక్కటి వేదికలుగా నిలిచాయి.
- ఇదే ఏడాది హైదరాబాద్ రవీంద్రభారతిలో అనంత కీర్తిని ఘనంగా చాటింది. అదే రోజు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకుని 'వండర్ కిడ్' బిరుదు అందుకుంది. బెంగళూరులో కల్చరల్ ఆర్ట్ పామ్‌లో ఆద్యకు జాతీయ స్థాయి ప్రథమ బహుమతి దక్కించుకుంది.
- హైదరాబాద్‌లో జరిగిన ఉగాది పురస్కార వేడుకల్లో 'బాల తేజం' అవార్డును అందుకుంది.



నృత్యప్రదర్శనల్లో గెలుపొందిన బహుమతులు, ప్రశంసాపత్రాలను చూపుతున్న చిన్నారి ఆద్యలక్ష్మి



గవర్నర్ నజీర్ అహ్మద్‌తో ఆద్యలక్ష్మి

ప్రోత్సాహముంటే సాధ్యమే



'వండర్ కిడ్ ఆద్యలక్ష్మి' అనంతపురానికి గర్వకారణమనడంలో సందేహం లేదు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పటి చిన్నారులు ఎంతో తెలివి తేటలు, అద్భుతమైన మేధస్సు కల్గి ఉన్నారు. వారిలో ఉండే ట్యాలెంట్ గుర్తించాలే కానీ వారి ప్రతిభను చాటడం పెద్ద సమస్య కాదు. ప్రతి చిన్నారిలో ఇదేరకమైన ప్రతిభ దాగుంటుంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆద్యలక్ష్మి అమ్మానాన్నలిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. వారు ఉద్యోగాల్లో బిజీగా ఉంటున్నా.. మేమే ఆద్యలక్ష్మిని నాట్య ప్రదర్శనలకు తీసుకెళ్తున్నాం. ఆమెకు మా వంతు సహకారం, ప్రోత్సాహం అందిస్తున్నాం.

– ధరణి, విశ్వనాథం, ఆద్యలక్ష్మి అవ్వతాతలు

ఉర్దూ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రుట రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఫైరోజ్ అహ్మద్

హిందూపురం అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న దాదాపు వెయ్యి ఉపాధ్యాయ పోస్టులను త్వరలో నిర్వహించే డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రుట) రాష్ట్ర వర్కింట్ ప్రెసిడెంట్ కె.ఫైరోజ్ అహమ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం హిందూపురంలోని అజీజియా మున్సిపల్ ఉన్నత పాఠశాలలో రుట సమావేశం జరిగింది. ముఖ్య అతిథి ఫైరోజ్ అహమ్మద్ మాట్లాడుతూ ఉర్దూ మీడియం పాఠశాలల్లో 238 ఉర్దూ భాషాపండితులను నియమిస్తామని చెప్పిన ఉన్నతాధికారులు ఆరు నెలలైనా పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 వరకు ఉర్దూ మీడియం సబ్జెక్టు టీచర్ల స్థానాల్లో ఉర్దూ వర్ణమాల రాని ఇతర మీడియం ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు నియమించిన తీరు ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. వెంటనే ఆ ఉపాధ్యాయులను వెనక్కు రప్పించి ఆయా స్థానాల్లో ఉర్దూ విద్యావలంటీర్లను నియమించాలన్నారు. జిల్లా సీఎంఓ, ఏపీఎంఓ అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ ఉర్దూ మీడియం పాఠశాలల, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, అజీజియా కాంప్లెక్స్ చైర్మన్ రంగనాయకులు, లెక్చరర్స్ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రషీద్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహమ్మద్ రఫీక్, ఆరిఫ్ అమిని, లనీస్, షేక్‌ఖాజావలి, ముస్తాక్ అహమ్మద్, నూర్ షరీఫ్, షఫీవుల్లా, మహమ్మద్ అన్సార్, మహమ్మద్ ఇర్షాద్, ఇర్ఫాన్ కౌసర్, కరీం, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

నీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం



ప్రాజెక్టులపై నిర్లక్ష్యాన్ని పోస్టర్ల ద్వారా ఎత్తిచూపుతున్న సీపీఎం నేతలు

అనంతపురం అర్బన్: జిల్లాలో నీటి ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ విమర్శించారు. జిల్లాలో జలవనరుల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద సీపీఎం మహాధర్నా నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన గఫూర్ మాట్లాడుతూ పంటలు పండక రైతులు అప్పులపాలయ్యారని, కరువు పరిస్థితులతో ప్రజల బతుకులు దుర్భరంగా మారాయని అన్నారు. జిల్లాను ఆదుకోకపోతే ఎడారిగా మారుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరించినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో కరువు లేకుండా చేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఎమ్మెల్యేలతో ప్రస్తావించారని, ఆయన ఇక్కడికి వచ్చి చూస్తే వాస్తవం ఏమిటో కనిపిస్తుందని పేర్కొన్నారు. రైతులు అప్పులపాలై దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. 15 ఏళ్లు దాటినా హెచ్చెల్సీ ఆధునికీకరణ పూర్తి కాలేదన్నారు. ప్రాజెక్టుల వద్ద బస చేసి రాయలసీమ పాజెక్టులు పూర్తి చేస్తానని చంద్రబాబు గతంలో చెప్పారని గుర్తు చేశారు. నిధులు కేటాయించకుండా నిద్రపోతే ప్రాజెక్టులు పూర్తి కావని చురకలంటించారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు మంచి అవకాశం వచ్చిందని, ప్రాజెక్టులకు అధికంగా నిధులు కేటాయించేలా చూడాలని సూచించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, రాష్ట్ర నేత ఓబులు ప్రసంగించారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు నాయకులు వినతి పత్రం అందజేసి, తమ డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

'పెళ్లి పేరుతో మోసం'

యల్లనూరు: పెళ్లి చేసుకుంటానని చెప్పి యువకుడు మోసం చేశాడని ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెన్నపూసపల్లికి చెందిన సుజితను అదే గ్రామానికి చెందిన ఓబులేసు అనే యువకుడు ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పిన యువకుడు.. ఇప్పుడు ప్లేటు ఫిరాయించాడు. విషయాన్ని యువతి తన తల్లిదండ్రులకు తెలిపింది. అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు మోసం చేసిన ఓబులేసుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పెరవలిలో టీడీపీ నాయకుడి దౌర్జన్యం



ఎర్నాగప్ప ఇంటి ప్రహరీని కూలగొట్టిన దృశ్యం

శింగనమల: పెరవలిలో టీడీపీ నాయకుడు దౌర్జన్యానికి తెగబడ్డాడు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైన పెద్ద ఎర్నాగప్ప ఇటీవల వర్తకులకు చెందిన ఇంటిని కొనుగోలు చేసి.. ప్రహరీ నిర్మించుకున్నాడు. అయితే ఆ చుట్టుపక్కల ఉన్న సామాజిక వర్గం వారు కాకుండా వేరొక సామాజికవర్గం వారు కొనుగోలు చేయడాన్ని టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. అప్పటి నుంచి వారిపై గుర్రుగా ఉంటూ వచ్చారు. రాష్ట్రంలో కూటమి పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేత మారుతినాయుడు తమకు ఎదురు లేదని రెచ్చిపోయారు. సోమవారం తన అనుచరులతో జేసీబీని తీసుకొచ్చి ఎర్నాగప్ప ఇంటి ప్రహరీని కూల్చాడు. అడ్డు వచ్చిన పెద్ద ఎర్నాగప్ప కూతురు దివ్యాంగురాలైన నాగేంద్రమ్మపై దాడి చేశారు. గాయపడిన నాగేంద్రమ్మ అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది.

ఐటీఐల్లో ఐదో విడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఐదో విడత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తొలి నాలుగు విడతల అడ్మిషన్లలో మిగిలిపోయిన సీట్లను ఐదో విడతలో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 26లోగా iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఐటీఐల ప్రవేశాలకు 28న, ప్రైవేట్ ఐటీఐల ప్రవేశాలకు 30న కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు.

25న జాబ్‌మేళా

అనంతపురం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా ఈ నెల 25న అనంతపురంలోని మాస్టర్‌మైండ్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీపీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ముత్తూట్ గ్రూపు, టాటా ఎలక్ట్రానిక్స్, టాటా క్యాపిటల్, ఐఎఫ్ఎల్ సంస్థ, కాగ్నెట్ ఈ- సర్వీసెస్, బి- న్యూ, ఎస్‌బీఐ కార్డు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై 18 నుంచి 30 సంవత్సరాల్లోపు వయస్సు గల వారు అర్హులని, పూర్తి వివరాలకు 81434 20834లో సంప్రదించాలని సూచించారు.

పోలీసు వ్యవస్థలో భయానక పరిస్థితి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

అనంతపురం కార్పొరేషన్: 'రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్..లా అండ్ డిసార్డర్‌గా మారిపోయింది. సాక్షాత్తు ఓ సీఐ తల్లి దారుణ హత్యకు గురైంది. ఎస్ఐ, తదితర పోలీసులపై దాడులు, ఐపీఎస్, డీఎస్పీ అధికారుల సస్పెన్షన్లతో పోలీసు వ్యవస్థలో భయానక పరిస్థితిని కూటమి ప్రభుత్వం తీసుకువచ్చింది' అని హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఆరోపించారు. సోమవారం అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి నారా లోకేష్ కనుసన్నల్లోనే పోలీసు వ్యవస్థ నిర్వీర్యం అవుతోందన్నారు. రాష్ట్రంలో బాలికలు, యువతులపై అత్యాచారాలను నియంత్రించడంలో చర్యలు తీసుకోవాల్సిన హోంమంత్రి అనిత మిన్నకుండిపోతున్నారన్నారు. కర్నూలు జిల్లా ముచ్చుమర్రిలో వాసంతి, పుంగనూరులో అంజుమ్, చిలమత్తూరులో అత్తాకోడళ్లపై అత్యాచారం, ఆస్పరిలో అశ్విని, బద్వేల్‌లోదస్తగిరి, మదనపల్లిలో స్వర్ణకుమారి (ఇన్‌స్పెక్టర్ తల్లి)పై జరిగిన దాడులను ఆయన గుర్తు చేశారు. అత్తాకోడళ్లపై అత్యాచారం జరిగితే.. అక్కడి ఎమ్మెల్యే బాలకృష్ణకు హోం మంత్రి కాళ్లు నమస్కరించడమేంటని ప్రశ్నించారు. హోం మంత్రి తన బాధ్యతను గుర్తెరిగి మహిళలకు భద్రత కల్పిస్తే మీ కాళ్లు మొక్కుతామని మాధవ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యం చేసుకుని దాడులు, దౌర్జన్యాలు, హత్యలు జరుగుతున్నా పోలీసులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని విమర్శించారు. ఇసుక, మద్యం పాలసీలతో ప్రజాప్రతినిధులు జేబులు నింపుకుంటున్నారన్నారు. తల్లికి వందనం, ప్రతి కుటుంబానికీ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, నిరుద్యోగ భృతి, 20 లక్షల మందికి ఉద్యోగాలు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500 ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పారని మండిపడ్డారు. అన్నదాతా సుఖీభవ పథకం కింద రైతులకు ఇంతవరకూ సాయం అందించలేదన్నారు. పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌ను ప్రజలు సూపర్ అని, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబును లోఫర్ అని, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను జోకర్ అని ప్రజలు అభివర్ణిస్తున్నారన్నారు. జమిలి ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నసనకోట ముత్యాలు, కుంటిమద్ది రమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు వినూత్నంగా ఆలోచించాలి




మాట్లాడుతున్న ఆర్జేడీ శామ్యూల్

అనంతపురం ఎడ్యుకేషన్: బోధనలో ఉపాధ్యాయులు వినూత్నంగా ఆలోచించాలని పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ సూచించారు. ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతులు బోధించే ఎస్జీ టీచర్లకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) తొలివిడత శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. బుక్కరాయసముద్రం మండల పరిధిలోని విజయభారతి డీఎడ్ కళాశాలలో ప్రారంభమైన శిక్షణకు అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి టీచర్లు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్జేడీ శామ్యూల్ శిక్షణను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేజీ నుంచి పీజీ వరకు పరిశీలిస్తే 1, 2 తరగతుల పిల్లలకు చదువు చెప్పడం చాలా కష్టమన్నారు. ఈ టీచర్లకు చాలా ఓపిక ఉండాలన్నారు. ప్రభుత్వం చాలా మంచి ఉద్దేశంతో టీచర్లకు ఈ శిక్షణ ఇప్పిస్తోందన్నారు. ఇక్కడ నేర్చుకున్న ప్రతి అంశాన్ని పాఠశాలల్లో పూర్తిస్థాయిలో అమలు చేసినప్పుడే పిల్లల్లో ప్రగతి కనిపిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం తగ్గుతోందన్నారు. వినూత్నపద్ధతుల్లో బోధన చేయడం ద్వారా పిల్లల్లో ఆసక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ నాగరాజు, రాష్ట్ర పరిశీలకులు మల్లికార్జున, డెప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, సమగ్రశిక్ష ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎఫ్ఎల్ఎన్ మాడ్యూల్‌ను ఏపీసీ నాగరాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ఫుట్‌బాల్ పోటీల్లో లడఖ్ జట్టు విజయం

- అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా మధ్య మ్యాచ్ డ్రా



గోల్‌కొట్టిన ఆనందంలో లడఖ్ క్రీడాకారులు

అనంతపురం: ఆర్డీటీ క్రీడామైదానంలో రాజమాత జిజాబాయి ట్రోఫీ -2024 సీనియర్ మహిళల జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం ఉదయం లడఖ్, మధ్యప్రదేశ్ జట్ల మధ్య మ్యాచ్‌ను ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేనియల్ ప్రదీప్ ప్రారంభించారు. లడఖ్ రెండో గోల్స్ చేయగా, మధ్యప్రదేశ్ ఒక గోల్ కూడా సాధించకపోవడంతో చతికిలపడింది. దీంతో లడఖ్ జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఒక జట్టు కూడా గోల్ చేయకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కార్యక్రమంలో అనంతపురం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ, మాజీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

జలసంరక్షణలో హంపాపురం ఆదర్శం

- వాటర్‌షెడ్ పథకంతో జాతీయ గుర్తింపు
- నేడు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు ప్రదానం



సహజ వనరుల చిత్ర పటాన్ని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ కమిషనర్ సూర్య కుమారి (ఫైల్)

రాప్తాడు: జల సంరక్షణలో హంపాపురం ఆదర్శంగా నిలిచింది. భూగర్భ జలాల పెంపు, నిరుపేదల రైతుల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా చేపట్టిన ఇక్కడి వాటర్‌షెడ్ ప్రాజెక్టును కేంద్ర జలశక్తి అభియాన్ జాతీయస్థాయి అవార్డుకు ఎంపిక చేసింది. మంగళవారం ఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా డ్వామా ఏపీడీ సుధాకర్ రెడ్డి, హంపాపురం గ్రామ వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్ ఆగ్రోస్ గద్దె కేశవరెడ్డి, సర్పంచ్ గౌరవ లక్ష్మీదేవి ఉత్తమ అవార్డు అందుకోనున్నారు. దేశ వ్యాప్తంగా మూడు గ్రామ పంచాయతీలను ఎంపిక చేయగా.. అందులో హంపాపురం వాటర్ షెడ్ ఒకటి ఉండడం విశేషం. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి, కేంద్ర జలశక్తి అభియాన్ అధికారుల బృందం ఈ ఏడాది ఆగస్టు 11న హంపాపురంలో పర్యటించి వాటర్ షెడ్ పనులను పరిశీలించారు. వాటర్‌షెడ్ పథకం కింద రైతులకు ఉపయోగపడే విధంగా పనులు చేశారని ఆ రోజే జిల్లా అధికారులను ప్రశంసించారు.

వాటర్‌షెడ్ ప్రాజెక్టు పనులు ఇలా..

హంపాపురం గ్రామ పంచాయతీకి 2022-23 సంవత్సరానికి వాటర్‌షెడ్ ప్రాజెక్టు మంజూరు చేశారు. రూ.3.74 కోట్ల నిధులతో 78 పనులు పూర్తి చేశారు. ఇక్కడ తక్కువ వర్షపాతం కారణంగా భూగర్భజలాలు 31 మీటర్ల లోతులో ఉండేవి. వాటర్‌షెడ్ ప్రాజెక్టు నిర్మాణం తరువాత భూగర్భజలాలు పెరిగాయి. 20 అడుగులలోనే నీళ్లు పడుతున్నాయి. దీంతో గ్రామంలో తాగు, సాగునీటి కొరత తీరింది. దీంతో బోరు బావుల కింద సాగు పంటల సాగు పెరిగింది. కొండలలో ఖండిత కందకం ఒకటి, చిన్న ఊటకుంట ఒకటి, ప్రహరి కందకం ఒకటి, చేపల గుంతలు 3, అమృత్ సరోవర్ 4, సామూహిక నీటి నిల్వ గుంతలు 5, సేద్యపు కుంటలు 8, డగ్గౌట్ పాండ్‌లు 9, నీటి నిల్వ గేబియన్‌ల మరమ్మతు పనులు 15, పైకప్పు నీటి ఇంకుడు గుంతలు 30, ఒక చెక్ డ్యాం పూడిక తీత తొలగింపు, ఇలా మొత్తం 78 పనులు చేపట్టారు. దీంతో గ్రామంలో జలవనరులు సమృద్ధిగా పెరిగాయి. హంపాపురం వాటర్‌షెడ్ ప్రాజెక్టుకు జాతీయ స్థాయి అవార్డు రావడం శుభసూచికమని డ్వామా ఏపీడీ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలో మరిన్ని వాటర్ ప్రాజెక్టులు అభివృద్ధి చేసి అవార్డులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. అధికారుల కృషి, సహకారంతోనే హంపాపురం గ్రామపంచాయతీ వాటర్‌షెడ్ ప్రాజెక్టుకు అవార్డు వచ్చిందని వాటర్‌షెడ్ కమిటీ మాజీ చైర్మన్ ఆగ్రోస్ గద్దె కేశవరెడ్డి, సర్పంచ్ గౌరవ లక్ష్మీదేవి తెలిపారు. తమ గ్రామ ప్రజలు వాటర్‌షెడ్ అధికారులు, కేంద్ర జలశక్తి అభియాన్ అధికారులకు రుణపడి ఉంటామన్నారు.

క్లుప్తంగా

ఘనంగా వాల్మీకి జయంతి



బోనాలు తీసుకొస్తున్న బాలికలు

ఆత్మకూరు: మండల కేంద్రంలో సోమవారం వాల్మీకి జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తొలుత మహిళలు బోనాలను ప్రత్యేకంగా అలంకరించి వీధుల్లో ఊరేగించారు. ఆత్మకూరు సెంటర్‌లోని వాల్మీకి విగ్రహం వద్దకు చేరుకుని టెంకాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం బోనాలను సమర్పించారు. సాయంత్రం వాల్మీకి చిత్రపటానికి గ్రామోత్సవం నిర్వహించారు.

నేటి నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపులు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో మంగళవారం నుంచి ఈనెల 25వ తేదీ వరకూ ఆధార్ స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఓ ప్రకటన విడుదల చేసింది. 0–5 ఏళ్ల లోపు పిల్లలకు మ్యాండేటరీ ఆధార్, న్యూ ఎన్రోల్మెంట్ జరిగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 22న రాణినగర్‌లోని ఆశా ప్రాథమిక పాఠశాల, హమాలీ కాలనీ వార్డు సచివాలయం, 23న పాతూరు నంబర్–2 స్కూల్, హమాలీ కాలనీలోని యూపీ స్కూల్, 24న పాతూరులోని 15వ వార్డు స్కూల్, బుడ్డప్ప నగర్ రాజేంద్ర నగరపాలక పాఠశాల, 25న పాతూరులో కస్తూరి బా, నంబర్–1 స్కూల్, నవోదయ కాలనీలోని రహమత్ మునిసిపల్ యూపీ పాఠశాలలో ఆధార్ స్పెషల్ క్యాంపులు జరుగుతాయన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయపడిన మల్లికార్జున

ఆత్మకూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన సోమవారం ఆత్మకూరు బైపాస్ వద్ద చోటు చేసుకుంది. రాయదుర్గం మండలం గ్రామదట్ల గ్రామానికి చెందిన మల్లికార్జున తన ద్విచక్ర వాహనంలో అనంతపురం నుంచి గ్రామదట్లకు బయలుదేరాడు. ఆత్మకూరు బైపాస్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో మల్లికార్జున తలకు బలంగా గాయాలు కాగా.. ఓ కాలి నుంచి ఎముక బయటకు వచ్చింది. స్థానికులు వెంటనే పోలీసులు, 108కు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి త్వరగా చేరుకుని 108 కోసం దాదాపు గంట వరకూ ఎదురుచూశారు. ఎంత సేపటికీ 108 వాహనం రాకపోవడంతో వడ్డుపల్లి టోల్‌గేట్ వద్ద ఉన్న 1033 వాహనంలో మల్లికార్జునను ఆసుపత్రికి పోలీసులు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎంపిక ప్రక్రియ



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో సోమవారం ఎస్కేయూ, జేఎన్‌టీయూ అనంతపురం వర్సిటీలకు సంబంధించిన ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు సంయుక్తంగా ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎంపిక ప్రక్రియ నిర్వహించాయి. ఎన్‌ఎస్‌ఎస్ రీజినల్ కో–ఆర్డినేటర్ డైరెక్టర్ సైదా, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.మురళీధర్ రావు, జేఎన్‌టీయూ అనంతపురం ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్. శారద ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. ఎంపిక ప్రక్రియలో ఎత్తు, పరుగు సామర్థ్యం, కవాతు ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలతో సహా వలంటీర్ల ప్రతిభాపాటవాలను పరిశీలించారు.

డీఎస్సీలో ప్రత్యేక టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: రాబోయే డీఎస్సీలో ప్రత్యేక టీచర్ల పోస్టులు భర్తీ చేయాలని ప్రత్యేక ఉపాధ్యాయుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం టెట్ పరీక్ష కేంద్రాల వద్ద సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ వర్మ, ప్రధానకార్యదర్శి తలారి అంజనయ్య, గంగాధర్, ప్రశాంత్, ఇంతియాజ్, రవికుమార్, లక్ష్మీమంజుల తదితరులు మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులు, దివ్యాంగులకు పెన్షన్లు పెంచుతున్నారు గానీ దివ్యాంగ విద్యార్థుల విద్యపై అశ్రద్ధ చేస్తున్నారంటూ మండిపడ్డారు. తెలంగాణలో ప్రత్యేక టెట్ నిర్వహించనప్పటికీ తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిందన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం 2016 – విద్యా హక్కు సవరణ చట్టం కింద ప్రతి పాఠశాలలోనూ ప్రత్యేక ఉపాధ్యాయులు ఉండాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 1:10, ఉన్నత పాఠశాలల్లో 1:10 నిష్పత్తి ప్రకారం ప్రత్యేక ఉపాధ్యాయులు ఉండాలన్నారు. ప్రత్యేక డీఎస్సీ పోస్టులను వెంటనే భర్తీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.



‘ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు హనుమప్ప. చేతికి గాయం కావడంతో వైద్యం కోసం బెళుగుప్ప మండలం నుంచి ఆత్మకూరు పీహెచ్‌సీకి వచ్చాడు. పరీక్షించిన వైద్య సిబ్బంది.. గాయానికి కట్టు కట్టేందుకు ఆస్పత్రిలో బ్యాండేజీలు లేవు. బయటి నుంచి తెచ్చుకోండి అంటూ సలహా ఇచ్చారు. దీంతో హనుమప్ప చేసేదేమీ లేక కిలోమీటర్ దూరంలో ఉన్న ఓ మెడికల్ స్టోర్ నుంచి బ్యాండేజీ తీసుకొచ్చి గాయానికి కట్టు కట్టించుకున్నాడు’

బ్యాండేజీలు లేవు.. బయట తెచ్చుకోండి



ఆత్మకూరు ఆసుపత్రిలో గాయాలకు కట్లు కడుతున్న దృశ్యం

- ఆత్మకూరు ఆస్పత్రిలో బ్యాండేజీల కొరత
- మెడికల్ స్టోర్ల నుంచి తెచ్చుకోండి అంటూ స్లిప్పులు రాసిస్తున్న వైద్య సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న రోగులు



ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు తిష్టవేశాయి. మందుల కొరతతో పూర్తిగా వైద్య సేవలు అందడం లేదు. మౌలిక వసతులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో గాయాలకు కట్టే బ్యాండేజీలు లేకపోవడంతో ఆసుపత్రి సిబ్బంది బయట తెచ్చుకోండి అంటూ రాసిస్తున్నారు. దీంతో రోగులు మెడికల్ స్టోర్లకు పరుగులు పెడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే మందులు లేకపోతే ఎలా అంటూ రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి కళ్యాణదుర్గం మండలం, బెళుగుప్ప, కూడేరు, కనగానపల్లి మండలాల నుంచి పెద్ద ఎత్తున రోగులు వస్తుంటారు. అన్ని గ్రామాలకు ఈ పీహెచ్‌సీ అందుబాటులో ఉండటంతో ఎక్కువగా రోగులు ఆత్మకూరు ఆసుపత్రికి వస్తారు. రోజుకు దాదాపు 200 మంది వరకూ ఆసుపత్రికి అవుట్ పేషెంట్స్ వస్తున్నారు.

వసతులు కరువు..

ఇంత మంది వచ్చే ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు, మందులు లేకపోతే ఎలా అంటూ రోగులు మండిపడుతున్నారు. ఉచిత ప్రభుత్వ ఆసుపత్రి అని వస్తే మందులు, బ్యాండేజీలు బయట కొని తెచ్చుకోండి అని పంపించడం సరికాదని చెబుతున్నారు. ఆసుపత్రి నుంచి మెడికల్ స్టోర్లు దాదాపు ఒక కిలోమీటరు దూరంలో ఉన్నాయి. అంత దూరం వెళ్లి వచ్చే సరికి రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి బ్యాండేజీలు, ఇతర మందులు కూడా అందుబాటులో ఉంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆసుపత్రి ఎదుట ధర్నా..

రోగులకు బ్యాండేజీలతో పాటు, ఇతర మందులు అందుబాటులో ఉంచాలని కోరుతూ సోమవారం సీపీఐ నాయకులు ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులకు ఇబ్బందులు లేకుండా అన్ని మందులు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం అందుతుందనే ఉద్దేశంతో పేదలు ఇక్కడికి ఎక్కువగా వస్తారు. అయితే మందులు లేవంటూ బయటకు పంపించడం సరికాదని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. సీపీఐ నాయకులు, రోగులకు నచ్చచెప్పి ధర్నా విరమించారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ, శివ, సరస్వతమ్మ పలువురు కలసి డాక్టర్ సబిహా సుల్తానాకు వినతిపత్రం అందజేశారు.

అంగన్‌వాడీ పోస్టులకు రేపు ఇంటర్వ్యూలు

ఆత్మకూరు: మండలంలోని ముట్టాల–2, కుర్లపల్లి గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 23వ తేదీన జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

ఘనంగా విద్వాన్ విశ్వం జయంతి



విద్వాన్ విశ్వం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రచయితలు, కవులు

అనంతపురం కల్చరల్: స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రాంగణంలో సోమవారం విద్వాన్ విశ్వం జయంతిని జిల్లా రచయితలు, కవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విరికన్య, పెన్నేటిపాట, మాణిక్యవీణ రచనలు జిల్లా సాహిత్యానికి ఎంతో పేరు తెచ్చిపెట్టాయన్నారు. పత్రికా సంపాదకుడిగా, రాజకీయనాయకుడిగా తరిమెల గ్రామం నుంచి జాతీయస్థాయికి ఎదిగిన మహనీయుడిగా విద్వాన్ విశ్వం చిరస్మరణీయ సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్ర, నాగలింగయ్య, అశ్వర్థరెడ్డి, హరీష్, ప్రవీణ్, శ్రీనివాసులు, టీవీరెడ్డి పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి



ఇన్‌చార్జ్ డీఈఓ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి శ్రీచైతన్య, నారాయణ పాఠశాలల్లో ఇంటర్ అడ్మిషన్లు ఇప్పటి నుంచి మొదలుపెట్టారు. సదరు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఇన్‌చార్జ్ డీఈఓ కృష్ణయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంత రాయుడు, కుళ్లాయి స్వామి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా శ్రీచైతన్య, నారాయణ విద్యా సంస్థల్లో వచ్చే విద్యా సంవత్సరానికి ఇంటర్ అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తూ ఒత్తిడికి గురి చేస్తున్నారని వాపోయారు. ఇప్పుడే బుక్ చేసుకుంటే ఫీజులో రాయితీ ఇస్తామంటూ నమ్మిస్తున్నారన్నారు. ఏటా జూన్‌లో ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత కళాశాలల్లో అడ్మిషన్లు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలు ఇవేవీ పట్టించుకోవడం లేదన్నారు. ఫీజుల రాయితీ అని ఈరోజు చెప్పి తర్వాత కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన తర్వాత ఎక్కువ మొత్తంలో ఫీజులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఇలాంటి ఘటనలు చాలా జరిగాయన్నారు. 8 నెలల ముందే ఇంటర్ అడ్మిషన్లు చేస్తున్న యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు మంజునాథ్, ఉమామహేష్, నాయకులు వంశీ, హర్ష, కార్తీక్ పాల్గొన్నారు.

ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలోని ప్రజారోగ్యాధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ.. నగరపాలక సంస్థ కార్మికులు (ఏఐటీయూసీ మునిసిపల్ వర్కర్స్) సోమవారం కార్యాలయం ఆవరణలో ధర్నా చేపట్టారు. ప్రజారోగ్యాధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ సిబ్బందికి పనిముట్లు, వాటర్ వర్క్స్‌లో జరుగుతున్న అభివృద్ధిపై విచారణ చేపట్టి, తగు చర్యలు తీసుకోవాలన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సమస్యల పరిష్కారం కావడం లేదన్నారు. మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను తీసుకోలేదన్నారు. అనంతరం వారు మేయర్ వసీంకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రాజేష్‌గౌడ్, కృష్ణుడు, చిరంజీవి, నాగరాజు, ప్రసాద్, శివకృష్ణ, నాగేంద్రబాబు, రఫి, హసేన్, రామాంజనేయులు, ఎర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

సంఘం పొదుపు డబ్బు స్వాహా



అధికారుల ముందు కన్నీటి పర్యంతమవుతున్న రజకనగర్‌కు చెందిన మీనాక్షి

అనంతపురం కార్పొరేషన్: ఆర్పీ పద్మ సంఘం సభ్యుల పొదుపు డబ్బు వాడుకుని మీకు దిక్కున్నచోట చెప్పుకోండని దబాయిస్తోంది. ఏడాదిగా నగరపాలక సంస్థ చుట్టూ తిరుగుతున్నా.. అధికారులెవరూ పట్టించుకోవడం లేదని సుబ్రహ్మణ్యం మహిళా సంఘం (రజక నగర్) అధ్యక్షురాలు మీనాక్షి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారుల ముందు కన్నీటి పర్యంతమైంది. సోమవారం డీఈలు వెంకటసుబ్బయ్య, లక్ష్మీ ప్రసన్న, ఏసీపీ శ్రీనివాసులకు వినతిపత్రం అందించారు. సంఘంలోని సభ్యులందరూ తనను చివాట్లకు గురి చేస్తున్నారన్నారు. చదువు రాకపోవడంతో ఆర్పీ పద్మ తమను మోసం చేసిందని తెలిపింది. ఆమెపై కేసు నమోదు చేయాలని కోరింది. ‘నగరంలోని ఖాజానగర్‌లో పీవీకేకే కళాశాల ఎదురుగా రోడ్డులో అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. తగు చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల సంఘం జేఎం బాషా ఫిర్యాదు చేశారు’. హమాలీ కాలనీలో సీసీ రోడ్డు, కాలువ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలుగు లక్ష్మి అనే మహిళ ఫిర్యాదు చేసింది. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మొత్తం ఏడు ఫిర్యాదులు వచ్చాయి. అందులో ఇంజినీరింగ్–4, మెప్మా 1, టౌన్ ప్లానింగ్ 2 ఫిర్యాదులు ఉన్నాయి.

అధికారుల డుమ్మా..

ప్రజా సమస్యలను తెలియజేయడానికి ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టారు. కేవలం తూతూమంత్రంగా స్పందన కార్యక్రమం నిర్వహించారు. సెక్షన్ హెడ్స్ పూర్తిస్థా

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



ఆత్మకూరు: అమరవీరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు



రాప్తాడు: పోలీసు అమరవీరులకు సెల్యూట్ చేస్తున్న సీఐ శ్రీహర్ష

రాప్తాడు: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని రాప్తాడు సీఐ టీ.వీ.శ్రీహర్ష అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ముందుగా పోలీసు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. పోలీసులు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజల, ధన, మన, ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారి సేవలను స్మరించుకునేందుకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పోలీసు అమరవీరుల ఆశయాలు కొనసాగిద్దామని పిలుపునిచ్చారు.

ఆత్మకూరు: దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేమని ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కొనియాడారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ప్రాణాలు అర్పించిన హనుమంతు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ దస్తగిరి, వరుణాచారి, కానిస్టేబుళ్లు పెద్దన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల దాతృత్వం

అనంతపురం: పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా ఏఆర్ 2011 బ్యాచ్‌కు చెందిన పోలీసులు దాతృత్వం చాటుకున్నారు. స్థానిక జేఎన్‌టీయూ కాలేజ్ రోడ్డు సమీపంలోని శ్రీ గురురాఘవేంద్ర వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులు అందజేశారు. జిల్లా ఎస్పీ సలహా మేరకు వారికి బియ్యం, నూనెలు, బస్సీరవ్వను అందించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమ నిర్వాహకులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సారోళ్లు ఎక్కడికి వెళ్లారో?



ఎస్‌ఈ గదిలో ఖాళీగా కన్పిస్తున్న కుర్చీ

కూటమి ప్రభుత్వం పుణ్యాన నగరంలో అభివృద్ధి కార్యక్రమాలకు బ్రేక్ పడింది. క్షేత్రస్థాయిలో అధికారులకు ఎటువంటి పని లేదు. కనీసం నగరపాలక సంస్థలోనైనా కాసేపు కూర్చుంటారా అంటే అదీ లేదు. సాక్షాత్తు ఎస్‌ఈ స్థాయి నుంచి ఈఈ, డీఈ, ఏఈలు ఉండటం లేదు. సోమవారం కేవలం ఇద్దరు డీఈలు మాత్రమే నగరపాలక సంస్థలో కన్పించారు. ఇక మిగతా వారు తమ గదులకు తాళాలు వేసుకుని పత్తా లేకుండా పోయారు. ఇంజినీర్లు ఈ విధంగా ఉంటే సచివాలయాల్లో అమినిటీలు ఏ విధంగా పనులు చేస్తున్నారో చెప్పాల్సిన పని లేదు. అధికారులు సమయపాలన పాటించకపోవడం పక్కన పెడితే కనీసం కార్యాలయాల్లో అందుబాటులో లేకుండా పోయారు. నగరపాలక సంస్థ అస్తవ్యస్థంగా మారిందనడానికి ఇది కూడా ఓ నిలువెత్తు సాక్ష్యం.

– అనంతపురం కార్పొరేషన్:



ఈఈ రాధాకృష్ణ గదికి తాళాలు వేసిన దృశ్యం

పక్కా భవనాల నిర్మాణానికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



అంగన్‌వాడీ కేంద్రం పైకప్పును పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత

రాప్తాడు: అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపడుతామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ‘అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు’ కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందంచారు. సీడీపీఓ ధనలక్ష్మి ఆదేశాల మేరకు సోమవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత మండలంలోని హంపాపురం గ్రామంలో అద్దె భనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. అద్దె భవనం కారుతుందని సాక్షి పత్రికలో రావడంతో పై కప్పును పరిశీలించారు. రెండు కేంద్రాల్లో మౌలిక వసతులపై అంగన్‌వాడీ కార్యకర్తలు శివలక్ష్మి, శివమ్మను అడిగి తెలుసుకున్నారు. రెండు సెంటర్ల భవనాల స్థితి గతులపై జిల్లా ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్తామన్నారు. పక్కా భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపడుతామన్నారు. అనంతరం పక్కా భవనాలు నిర్మించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు అంగన్‌వాడీ కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు.

తపోవనం జెడ్పీహెచ్ఎస్‌లో నాగుపాము



స్కూల్ కాంపౌండ్ నుంచి బయటకు వచ్చిన పాము

అనంతపురం ఎడ్యుకేషన్: నగర శివారులోని తపోవనం జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలోకి సోమవారం సాయంత్రం ఓ నాగుపాము వచ్చి కలకలం లేపింది. అదృష్టవశాత్తూ విద్యార్థులు లేని సమయం కావడంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. సాయంత్రం 6:30 గంటల సమయంలో బయట నుంచి కాంపౌండ్‌లోకి ప్రవేశించింది. ఆ సమయంలో చూసిన కొందరు స్థానికులు ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. స్థానికులు, ఉపాధ్యాయులు అక్కడికి చేరుకున్నారు. గంటపాటు పాఠశాల ఆవరణలోనే ఉన్న నాగుపాము చివరకు బయటకు వెళ్లిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాల చుట్టూ అపరిశుభ్రత తాండవిస్తోంది. చెత్తాచెదారం నిండుకుంది. పంచాయతీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. పరిసర ప్రాంతాలు శుభ్రంగా లేకపోవడంతోనే విష పురుగులు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. వందలాది మంది విద్యార్థులు ఈ స్కూల్‌లో చదువుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో పారిశుధ్య పనులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సమస్యలకు సకాలంలో పరిష్కారం చూపాలి



అర్జీలు తీసుకుంటున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: బాధితుల సమస్యలకు సకాలంలో పరిష్కారం చూపాలని ఎస్పీ జగదీశ్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ‘ప్రజా పరిష్కార వేదిక’ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి 80 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలియజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: మునిసిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ ఆఫీస్ వద్ద నిరసన తెలియజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ మునిసిపల్ హైస్కూళ్లల్లో ఇప్పటికీ తగినంత మంది సబ్జెక్టు టీచర్లు లేరన్నారు. 3, 4, 5 తరగతులను విలీనం చేశారు తప్ప ఆ తరగతులు బోధించడానికి స్కూల్ అసిస్టెంట్లు లేరన్నారు. ప్రమోషన్లు ఇచ్చి వెంటనే బదిలీలు జరపాలని డిమాండ్ చేశారు. 2006 డీఎస్సీ నుంచి ఇప్పటిదాకా నియమితులైన ఉపాధ్యాయులందరికి డీఎస్సీలు, కేడర్ల వారీగా సీనియార్టీ జాబితాలు ఇచ్చి రెగ్యులరైజేషన్ చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ ప్రభుత్వ, పంచాయతీ రాజ్ టీచర్లకు ఇచ్చినట్లే మున్సిపల్ ఉపాధ్యాయులకు అర్బన్ ఎంఈఓ పోస్టులు ఇవ్వాలన్నారు. మున్సిపల్ టీచర్ల పీఎఫ్ ఖాతాలు మునిసిపాలిటీలలో నిరుపయోగంగా ఉన్నాయన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు రమణయ్య మాట్లాడుతూ మునిసిపల్ హైస్కూళ్లల్లో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, సహాధ్యక్షురాలు సరళ, నాయకులు దేవేంద్రమ్మ, సుబ్బరాయుడు, పవన్ కుమార్, ఆదిశేషయ్య, శ్రీనివాసులు. నాగేంద్ర, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఏఓ ప్రసాద్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

అనంతపురం అగ్రికల్చర్: రాప్తాడు వ్యవసాయశాఖ అధికారి (ఏఓ) ప్రసాద్ సస్పెన్షన్ ఎత్తివేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ సోమవారం జీఓ జారీ చేశారు. 2023 ఆగస్టు 26న రూ.15 వేలు లంచం తీసుకున్నట్లు ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసిన విషయం విధితమే. ఇదే కేసులో ఉన్న ఏడీఏ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ గిరిబాబుపై ఉన్న సస్పెన్షన్‌ను రద్దు చేశారు. ఈ క్రమంలో 14 నెలల తర్వాత వారి సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ పోస్టింగ్ ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేశారు.

కొనసాగుతున్న విత్తన పప్పుశనగ పంపిణీ

అనంతపురం అగ్రికల్చర్: రబీలో పప్పుశనగ సాగుకు వీలుగా సబ్సిడీ విత్తన పంపిణీ కొనసాగుతోందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. నల్లరేగడి భూములు కలిగిన 22 మండలాల పరిధిలో ఆర్‌ఎస్‌కే వేదికగా ఇప్పటి వరకూ 19,819 క్వింటాళ్ల విత్తన పప్పుశనగ పంపిణీ పూర్తయిందన్నారు. జిల్లాకు కేటాయించిన 27,139 క్వింటాళ్లలో 20,044 క్వింటాళ్ల కోసం 14,216 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు. రాయితీ పప్పుశనగ విత్తనాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.